




# DD9 వార్త
తెలుగు దినపత్రిక


## ఎన్టీఆర్ పురస్కారం గొప్ప గౌరవం





సంపుటి : 01 సంచిక : 213 హైదరాబాద్, మార్చి, సోమవారం 23, 2026 పేజీలు : 06 వెల : 3.00

## కాంగ్రెస్‌కు వీడ్కోలు దిశగా
# జీవన్ రెడ్డి

**25న రాజీనామా చేయనున్నట్లు ప్రకటన**

- పార్టీ కార్యకర్తలకు బహిరంగ లేఖ విడుదల
- కొన్ని నెలలుగా మానసిక ఒత్తిడిలో ఉన్నానని వ్యాఖ్య
- అవమానాలు భరించలేక తప్పకుంటున్నానని వెల్లడి
- రాజీనామా తర్వాత స్థానిక నేతలతో చర్చలు
- భవిష్యత్ రాజకీయాలపై త్వరలో నిర్ణయం
- ఇతర పార్టీల ఆహ్వానాలపై ఆసక్తికర చర్చలు
- జగిత్యాల రాజకీయాల్లో కొత్త పరిణామాలకు తెర



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఆయన పార్టీ కార్యకలాపాలపై అసంతృప్తిగా ఉన్నారన్న వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో ఈ ప్రకటన మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.జగిత్యాల ప్రాంతానికి చెందిన ఈ నేత, పార్టీ కార్యకర్తలకు రాసిన బహిరంగ లేఖలో తన నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ నెల 25న అధికారికంగా

..మిగతా 2లో



## రైతు సంక్షేమం విషయంలో
# రాజీపడబోము

- గత పాలనకంటే రైతులకు ఎక్కువ మేలు చేస్తున్నాం
- రైతుభరోసా కింద ఎకరాకు 12 వేలు ఇస్తున్నాం
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంతో ఇబ్బందికరంగా ఉంది
- అయినప్పటికీ రాజీపడకుండా రైతులకు సాయం చేస్తున్నాం
- రాష్ట్రంలో సారవంతమైన నేలలు ఉన్నాయి
- రైతులు అన్ని రకాలైన పంటలు పండించాలి
- రాజకీయంగా ఎవరిమీద వివక్ష లేదు
- అందుకే సిద్ధిపేటలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మించాం
- లేదంటే నా నియోజకవర్గానికి తరలించుకుపోయేవాన్ని కదా
- హరీశ్ రావు ను ఈ నియోజకవర్గంలో ఓడించాలి
- ఓడిస్తే వచ్చే క్యాబినెట్ లో మంత్రి పదవి ఇస్తాం
- సిద్దిపేట జిల్లా నర్మెట్ట బహిరంగసభలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రంలో రైతు సంక్షేమం విషయంలో ప్రభుత్వం ఎలాంటి పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా నిధులను ఆయన విడుదల చేశారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో నిర్వహించిన సభలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి, రైతులకు ఆర్థికంగా బలం చేకూర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పథకం కింద మొత్తం 1.50 కోట్ల ఎకరాలకు సాయం అందించేందుకు ప్రభుత్వం రూ.9 వేల కోట్లను కేటాయించింది. తొలి విడతగా రూ.3,590 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఆదివారం సెలవు దినం కావడంతో సోమవారం నుంచే ఈ నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని వెల్లడించారు. తదుపరి విడతల్లో ఇరవై రోజుల

..మిగతా 2లో

## భవన నిర్మాణ రంగంలో
# సవరణలు

- టీడీఆర్ నిబంధనల్లో భారీ సడలింపులు
- బిల్డర్లు, డెవలపర్లకు ఉపశమనమిచ్చే నిర్ణయాలు
- హై-రైజ్ భవనాల నిర్వచనంలో మార్పులు
- టీడీఆర్ వినియోగంపై కొత్త శాతం విధానం
- సెట్‌బ్యాక్ నిబంధనల్లో సడలింపులు
- నిర్మాణ రంగానికి ఊతమిచ్చే ప్రభుత్వ లక్ష్యం




## కాంగ్రెస్ సర్కార్‌తో కష్టాలు

- రుణమాఫీ కాక, రైతుభరోసా రాక రైతుల తిప్పలు
- రైతు తుడుం గణపతిది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రైతు తుడుం గణపతిది ముమ్మాటికి ప్రభుత్వ హత్యనేనని ఆరోపించారు. గణపతి ఆత్మహత్యపై 'ఎక్స్' వేదికగా కేటీఆర్ ఆదివారం స్పందించారు. రాష్ట్రంలో రైతుబంధు పాలన పోయి రాబందుల పాలన వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటను కాంగ్రెస్ సర్కార్ కొనకపోవడంతో నానాకష్టాలు

..మిగతా 2లో





## రైతు భరోసా
# నిధులు విడుదల

- తొలి విడతగా రూ.3,600 కోట్లు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- 70 లక్షల రైతుల ఖాతాలకు తొలి విడత నిధులు
- సోమవారం నుంచి బ్యాంక్ ఖాతాల్లో జమ ప్రారంభం
- దశలవారీగా మొత్తం రూ.9,000 కోట్ల పంపిణీ
- రైతును ఆర్థికంగా బలపరచడమే ప్రభుత్వ లక్ష్యం
- సిద్దిపేటలో రైతు ఉత్సవాలకు సీఎం హాజరు
- పామాయిల్ సాగుకు ప్రోత్సాహం – కొత్త ఫ్యాక్టరీ ప్రారంభం
- పంటల మార్పిడితో ఆదాయం పెంచాలని సూచన



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణలో రైతుల సంక్షేమానికి ప్రభుత్వం మరో ముఖ్యమైన అడుగు వేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా పథకం కింద భారీ మొత్తంలో నిధులను విడుదల చేశారు. తొలి విడతగా లక్షలాది మంది రైతులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి నిధులు జమ చేయడానికి

..మిగతా 2లో

## భూములు గుంజుకుంటే ఊరుకోం

- ఎకరం లాక్కొని.. 400 గజాలు ఇస్తారా?
- ల్యాండ్ పూలింగ్ స్కీం రూపకర్త కేసీఆరే
- గత సర్కార్‌లా చేస్తే.. ఈ ప్రభుత్వం పని ఖతం
- ఎంపీ ఈటల రాజేందర్

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

కాంగ్రెస్ సర్కార్ పేదల ఇండ్లను గుంజుకుంటే చూస్తూ ఊరుకోబోమని మల్కాజిగిరి ఎంపీ

..మిగతా 2లో



## భారత్‌కు భారీ ఎల్పీజీ దిగుమతులు

- మంగళూరుకు చేరిన భారీ ట్యాంకర్
- అంతర్జాతీయ ఉద్రిక్తతలతో గ్యాస్ కొరత
- గృహ, వ్యాపార రంగాలపై తీవ్ర ప్రభావం
- హోటళ్లు మూసివేత దశకు చేరిన పరిస్థితులు
- మంగళూరు పోర్టుకు భారీ ఎల్పీజీ ట్యాంకర్ చేరిక
- ఇతర పోర్టులకు వరుసగా చేరుతున్న కార్గో నౌకలు
- ప్రాధాన్యత రంగాలకు దశలవారీగా సరఫరా
- మరిన్ని దిగుమతులతో పరిస్థితి మెరుగయ్యే అవకాశం




**హైదరాబాద్, (డిడి9 వార్త):**

దేశంలో వంటగ్యాస్ సరఫరాపై అంతర్జాతీయ పరిణామాల ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఇరాన్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు ఇంధన సరఫరా గొలుసును దెబ్బతీశాయి. దాని ప్రభావం ఇప్పుడు భారతదేశంలో స్పష్టంగా కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో

..మిగతా 2లో

# కాంగ్రెస్‌కు వీడ్కోలు దిశగా జీవన్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి**



కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పనున్నట్లు స్పష్టం చేశారు.

**కార్యకర్తలకు లేఖ – స్పష్టమైన సంకేతం**

జీవన్ రెడ్డి తన నిర్ణయాన్ని ముందుగా పార్టీ కార్యకర్తలకు తెలియజేయడం విశేషం. బహిరంగ లేఖ ద్వారా ఆయన తన మనసులోని భావాలను వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీలో ఇక కొనసాగడం సాధ్యం కాదని స్పష్టంగా పేర్కొన్నారు.ఈ లేఖలో ఆయన వ్యక్తిగతంగా ఎదుర్కొన్న పరిస్థితులను వివరించారు. పార్టీ కార్యకర్తలతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, భవిష్యత్తులో కూడా వారి మద్దతు అవసరమని కోరారు.

**మానసిక ఒత్తిడి, అసంతృప్తి**

గత కొంతకాలంగా తాను తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నానని జీవన్ రెడ్డి వెల్లడించారు. దాదాపు 20 నెలలుగా పార్టీ అంతర్గత పరిస్థితులు తనను కలవరపెడుతున్నాయని తెలిపారు.పార్టీలో తనకు సరైన ప్రాధాన్యం లభించడం లేదని, అనేక సందర్భాల్లో నిర్లక్ష్యం ఎదురైందని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో కొనసాగడం కష్టమైందని స్పష్టం చేశారు.

**అవమానాలు భరించలేక నిర్ణయం**

పార్టీలో అవమానాలు ఎదుర్కొంటూ కొనసాగడం సాధ్యం కాదని జీవన్ రెడ్డి తేల్చి చెప్పారు. రాజకీయాల్లో స్వాభిమానానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.తనకు ఎదురైన అనుభవాల కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. పార్టీకి తన సేవలు అందించినప్పటికీ తగిన గుర్తింపు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**రాజీనామా తర్వాత కార్యాచరణ**

రాజీనామా చేసిన తర్వాత తన తదుపరి కార్యాచరణపై స్పష్టత ఇస్తానని జీవన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా జగిత్యాల ప్రాంతంలో స్థానిక నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.ఈ సమావేశంలో అందరి అభిప్రాయాలు తెలుసుకుని, తదుపరి రాజకీయ నిర్ణయం తీసుకుంటానని వెల్లడించారు. కార్యకర్తల సూచనలకు ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు.

**భవిష్యత్ రాజకీయాలపై ఆసక్తి**

జీవన్ రెడ్డి భవిష్యత్ రాజకీయాలపై ఇంకా పూర్తి స్పష్టత ఇవ్వకపోయినా, త్వరలోనే తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని తెలిపారు. ఆయన ఏ పార్టీ వైపు అడుగులు వేస్తారన్నదానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.ప్రస్తుతం వివిధ పార్టీల నుంచి ఆయనకు ఆహ్వానాలు వస్తున్నట్లు సమాచారం. అయితే తుది నిర్ణయం కార్యకర్తలతో చర్చించిన తర్వాత తీసుకుంటానని చెప్పారు.

**ఇతర పార్టీల ప్రయత్నాలు**

ఇదిలా ఉండగా, జీవన్ రెడ్డిని తమ పార్టీలోకి తీసుకురావడానికి ఇతర రాజకీయ పార్టీలు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ నేతలు ఆయనతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. ఈ చర్చలు ఎంతవరకు సఫలమవుతాయన్నది ఆసక్తికరంగా మారింది. మరో రెండు మూడు రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది.

**జగిత్యాల రాజకీయాల్లో మార్పులు**

జీవన్ రెడ్డి నిర్ణయం జగిత్యాల రాజకీయాల్లో కొత్త మార్పులకు దారి తీసే అవకాశం ఉంది. ఆయనకు స్థానికంగా ఉన్న బలమైన అనుచర వర్గం కారణంగా ఈ పరిణామం ప్రభావం చూపే అవకాశముంది. పార్టీ మార్పు జరిగితే స్థానిక రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ పరిణామాలు మరింత వేగంగా మారే అవకాశముంది. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆయన తదుపరి నిర్ణయం ఏ దిశగా ఉంటుందన్నదానిపై అందరి దృష్టి నిలిచింది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారి తీసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# రైతు సంక్షేమం విషయంలో రాజీపడబోము

**మొదటిపేజీ తరువాయి**

వ్యవధిలో రెండో విడతగా రూ.2,650 కోట్లు, మూడో విడతగా రూ.2,760 కోట్లు విడుదల చేయనున్నట్లు వివరించారు. రైతులకు సమయానికి నిధులు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు కొన్ని ఇబ్బందులు కలిగిస్తున్నప్పటికీ రైతుల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. వరి పంటకు ప్రోత్సాహకంగా అదనపు ధనసహాయం అందిస్తున్నామని, వరదల వల్ల పంటలు నష్టపోతే పరిహారం కూడా చెల్లిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.1.40 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. రైతు సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు దీర్ఘకాలంలో మంచి ఫలితాలను ఇస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో పంటల విధానంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఒకే పంటపై ఆధారపడకుండా రైతులు పంట మార్పిడి పద్ధతులను అవలంబించాలని సూచించారు. గతంలో రంగారెడ్డి జిల్లాలో విస్తృతంగా కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు సాగు చేసేవారని, ప్రస్తుతం భూసంపదను నిర్మాణ రంగానికి మళ్లించడం వల్ల ఆ పంటల సాగు తగ్గిపోయిందని తెలిపారు. దాంతో ఇతర రాష్ట్రాల నుంచి ఆహార పదార్థాలను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు రైతులు విభిన్న పంటలను సాగు చేయాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వం వరి కొనుగోలు పరిమితిని నిర్ణయించడం వల్ల రైతులు కేవలం వరిపైనే ఆధారపడకుండా ఇతర పంటలను కూడా సాగు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. పంట మార్పిడి ద్వారానే వ్యవసాయం లాభదాయకంగా మారుతుందని చెప్పారు. ఈ క్రమంలో నిజామాబాద్ జిల్లా అంకాపూర్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అక్కడి రైతులు ఆధునిక విధానాలను అనుసరించి అధిక ఆదాయం సాధిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి జిల్లా ఒక ప్రత్యేక పంటకు ప్రసిద్ధి చెందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

రాష్ట్రంలో సారవంతమైన భూములు, కష్టపడే రైతులు ఉన్నందున వ్యవసాయ రంగంలో పెద్ద అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. పంటలను అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రైతుల ఆదాయం పెరగడం ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. మహిళా సాధికారతపై కూడా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్రంలో కోటిమంది మహిళలను ఆర్థికంగా బలపరచి వారిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మహిళలను వ్యాపార రంగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఒకప్పుడు పెద్ద వ్యాపారవేత్తలు మాత్రమే చేపట్టే సౌర విద్యుత్ రంగంలో ఇప్పుడు మహిళలు కూడా ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళల ద్వారా సౌర విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.



విద్యా రంగంలో ప్రభుత్వం చేపడుతున్న మార్పులను కూడా ముఖ్యమంత్రి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చిన్న తరగతుల నుంచే ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం కూడా అందిస్తున్నామని పేర్కొన్నారు. పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

రాజకీయ అంశాలపై మాట్లాడుతూ, ఎన్నికల సమయంలోనే రాజకీయ పోటీ ఉండాలని, మిగతా సమయంలో అభివృద్ధి కోసం అన్ని వర్గాలు కలిసికట్టుగా పని చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రత్యర్థి పార్టీల నేతలతో రాజకీయ భేదాలు ఉండొచ్చుగానీ, ప్రజల అభివృద్ధి విషయంలో వివక్ష ఉండకూడదన్నారు. అన్ని ప్రాంతాలకు సమానంగా నిధులు కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు.

రాబోయే ఎన్నికల్లో సిద్దిపేటలో కాంగ్రెస్ విజయం సాధించాలని ఆకాంక్ష వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి, అక్కడి నుంచి గెలిచిన వ్యక్తికి మంత్రి పదవి ఇవ్వనున్నట్లు ప్రకటించారు. గతంలో కొన్ని ప్రాంతాలకు అన్యాయం జరిగిందని విమర్శిస్తూ, తాను అలాంటి విధానాన్ని అనుసరించబోనని అన్నారు. ప్రజల సంక్షేమమే తన ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు.


ఈ కార్యక్రమానికి ముందు నర్మెటలో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ పరిశ్రమను ముఖ్యమంత్రి ప్రారంభించారు. సుమారు 62 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్ల వ్యయంతో ఈ పరిశ్రమ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అదనంగా రూ.80 కోట్లతో పామాయిల్ శుద్ధి కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ పరిశ్రమల ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, వ్యవసాయానికి కూడా తోడ్పాటు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మొత్తంగా రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి, మహిళా సాధికారత, విద్యా రంగంలో మార్పులు, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, వ్యవసాయాన్ని లాభదాయక రంగంగా మార్చే దిశగా చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

# భూములు గుంజుకుంటే ఊరుకోం

**మొదటిపేజీ తరువాయి**

ఈటల రాజేందర్ విమర్శించారు. ఆదివారం ఆయన కోహెడ భూబాధితుల సంఘం ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ, కోహెడ గ్రామంలో ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు భూతల్లిని నమ్ముకుని నివసిస్తున్నారని, నాలుగు తరాలుగా ఆ భూములను దున్నుకుని జీవనం కొనసాగిస్తున్నారన్నారు. వారికి ఆనాటి ప్రభుత్వాలు ఎంక్వైరీ చేసి పట్టాలు ఇచ్చిందన్నారు. 12 సంవత్సరాల పైబడి పేదలు భూములపై జీవనం కొనసాగిస్తే ఆ భూములను ముట్టుకునే అధికారం ఎవరికీ ఉండదని గుర్తుచేశారు. రింగ్ రోడ్డు నిర్మాణ సమయంలో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములకు కూడా డబ్బులు ఇచ్చి తీసుకోవాలని తాము డిమాండ్ చేశామని, ఆ సమయంలో అసైన్డ్ భూముల వారికి కూడా డబ్బులు వచ్చాయని ఈటల గుర్తుచేశారు. అసైన్డ్ భూములు అమ్ముకునే అధికారం లేదు కానీ అనుభవించే అధికారం శాశ్వతంగా ఉంటుందని పేర్కొన్నారు. గవర్నమెంట్ అంటే ఎవడబ్బ జాగీర్ కాదని, గవర్నమెంట్ అంటే తెలంగాణ ప్రజలని ఆయన వ్యాఖ్యానించారు. బయట రాష్ట్రాల్లో 1520 ఏళ్ల అసైన్డ్ భూములపై జీవనం సాగించినవారికి ఆ భూములను అమ్ముకునే అధికారం కల్పించారని ఈటల వివరించారు. కానీ, కేసీఆర్ వచ్చాక ఒక దరిద్రపు స్కీమ్ తీసుకొచ్చారని, అదే ల్యాండ్ పూలింగ్ అని రాజేందర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. దాని పేరుతో ఒక ఎకరం లాక్కుని 400 గజాలు ఇచ్చారని, ప్రభుత్వానికి భూమి ఎక్కడ అవసరం వచ్చినా పేదల భూమి మాత్రమే ఎందుకు గుంజుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. గవర్నమెంట్ భూములు లేవా? అని నిలదీశారు. ఆనాడు కేసీఆర్ ఈ భూములు లాక్కుని 300 గజాల చొప్పున ఇస్తానని చెప్పి ఇప్పటికీ ఇవ్వకుండా పేదల కళ్ళల్లో మట్టి కొట్టాడని ధ్వజమెత్తారు. ఇకపోతే ఇందిరమ్మ రాజ్యమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ సర్కార్ కూడా అదే చేస్తున్నదన్నారు. షావుకారు గుట్టలకు సంబంధించిన భూములకు పరిహారం ఇవ్వకపోతే ప్రభుత్వ భరతం పడతామని ఈటల హెచ్చరించారు. అది చాలక మార్కెట్ కోసం కోహెడలో 159 మంది రైతులు సాగు చేస్తున్న 239 ఎకరాలు భూములను తీసుకుంటామంటే చూస్తూ ఊరుకోబోమని వార్నింగ్ ఇచ్చారు. పోలీసులు.. ప్రజలు, పేదలకు న్యాయం, ధర్మం చేయాలి తప్పితే దౌర్జన్యం చేయొద్దని సూచించారు. పాత షావుకారు గుట్టలకు ఎలా పరిహారం అందించారో.. ఇప్పుడు కూడా అలాగే అందించాలని డిమాండ్ చేశారు. కోహెడ గుట్టలను లాక్కునే ప్రయత్నం చేయొద్దని స్పష్టంచేశారు. కలెక్టర్ నారాయణ రెడ్డి.. వెంటనే స్పందించి సీఎంతో చర్చలు జరిపి కోహెడ గుట్టల పేదల భూములకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అధికారం ఉందని విర్రవీగితే గత సీఎం కేసీఆర్ ఫ్యూజులు పీకారని, అలాగే విర్రవీగితే కాంగ్రెస్ సర్కార్ ఫ్యూజు కూడా పీకడం ఖాయమని హెచ్చరించారు.



# కాంగ్రెస్ సర్కార్‌తో కష్టాలు

**మొదటిపేజీ తరువాయి**



పడుతున్న రైతన్నల గోడు తెలుసుకునేందుకు గతేడాది నవంబర్ 18న తాను స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్‌కు వెళ్లానని గుర్తు చేశారు. అంతకు ముందురోజే మీడియాతో ఆదిలాబాద్ జిల్లా ఆర్లీ(బీ)కి గ్రామానికి చెందిన తుడుం గణపతి తన కష్టాలు చెప్పుకుంటూ కళ్లనీళ్ల పర్యంతం అయ్యాడని, నాలుగు రోజులుగా మార్కెట్ యార్డులో ఉంటున్నా తన సోయాబీన్ పంటను కొనడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఇట్లాగే పంటను కొనకుండా వేధిస్తే, తనకు మరణం తప్ప మరోమార్గం లేదని రోదించాడని తెలిపారు. రుణమాఫీ కాక, రైతుభరోసా రాక, అప్పుల బాధ తీవ్రమై మూడు రోజుల క్రితం గణపతి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. అయితే, ఇది ఆత్మహత్య కాదని, ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యేనని ఆగ్రహం వ్యక్త చేశారు.

# భారత్‌కు భారీ ఎల్పీజీ దిగుమతులు

**మొదటిపేజీ తరువాయి**




వంటగ్యాస్ కొరత ఏర్పడి సాధారణ ప్రజల నుంచి వ్యాపార వర్గాల వరకు అందరినీ ఇబ్బందులకు గురిచేస్తోంది. డొమెస్టిక్ వినియోగదారులు మాత్రమే కాకుండా కమర్షియల్ వినియోగదారులు కూడా ఈ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా హోటళ్లు, చిన్న వ్యాపారాలు గ్యాస్ కొరత కారణంగా తమ కార్యకలాపాలను తగ్గించుకోవాల్సి వస్తోంది. కొన్ని చోట్ల తాత్కాలికంగా హోటళ్లు మూసివేయాల్సిన పరిస్థితులు కూడా ఏర్పడ్డాయి.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ప్రత్యామ్నాయ వనరులపై ఆధారపడుతున్నారు. కొన్ని చోట్ల ఎలక్ట్రిక్ స్టౌలు, మరికొన్ని చోట్ల వుడ్ లేదా ఇతర ఇంధనాల వినియోగం పెరుగుతోంది. ఈ పరిస్థితి కొనసాగితే మరింత ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సరఫరా గొలుసులో ఏర్పడిన అంతరాయాలు త్వరగా సరిదిద్దకపోతే గ్యాస్ కొరత మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో దేశానికి ఉపశమనం కలిగించేలా భారీ ఎల్పీజీ సరుకు దేశానికి చేరుతోంది. అమెరికా నుంచి బయలుదేరిన ఒక భారీ కార్గో నౌక ఇటీవల మంగళూరు న్యూ పోర్ట్‌కు చేరుకుంది. పైక్సిస్ పయనీర్ పేరుతో ఉన్న ఈ నౌక సుమారు 72,700 టన్నుల లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్‌ను తీసుకువచ్చింది. ఈ సరుకు చేరుకోవడం ప్రస్తుత గ్యాస్ కొరతను కొంతవరకు తగ్గించడంలో సహాయపడుతుందని అధికారులు భావిస్తున్నారు. నౌక పోర్ట్‌లోని 13వ బెర్త్ వద్ద నిలిపి, గ్యాస్ అన్‌లోడింగ్ ప్రక్రియ ప్రారంభించారు.

ఈ నౌక సింగపూర్ జెండా కింద నడుస్తున్నదిగా సమాచారం. అమెరికాలోని టెక్సాస్ ప్రాంతం నుంచి ఈ గ్యాస్ సరుకు లోడ్ చేసి భారతదేశానికి తీసుకొచ్చారు. ఇందులోని గ్యాస్‌ను వివిధ సంస్థలకు కేటాయించనున్నారు. ముఖ్యంగా ఏజిస్ లాజిస్టిక్స్ వంటి సంస్థలకు కొంత భాగం సరఫరా చేయబడుతుంది. ఈ సరుకు దేశంలోని వివిధ ప్రాంతాలకు పంపిణీ చేయబడుతూ గ్యాస్ కొరతను తగ్గించే ప్రయత్నం జరుగుతోంది.

ఇదిలా ఉండగా, ఇటీవల మరికొన్ని భారీ ట్యాంకర్లు కూడా దేశానికి చేరాయి. ముందుగా ముంద్రా పోర్ట్‌కు ముడి చమురు మరియు ఎల్పీజీతో కూడిన నౌకలు చేరాయి. అలాగే వడినార్ పోర్ట్‌కు కూడా భారీ ఎల్పీజీ సరుకు తీసుకొచ్చిన నౌకలు చేరినట్లు సమాచారం. ఈ సరుకులతో కలిపి దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల ఎల్పీజీ ఇప్పటికే దేశానికి అందింది. ఇప్పుడు మంగళూరుకు చేరిన ఈ తాజా సరుకుతో మొత్తం సరఫరా మరింత పెరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

మంగళూరులో అన్‌లోడ్ చేసిన గ్యాస్‌ను హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వంటి సంస్థల ద్వారా ప్రాసెస్ చేసి దేశంలోని వివిధ ప్రాంతాలకు పంపిణీ చేస్తారు. ఈ గ్యాస్‌ను బాట్లింగ్ ప్లాంట్లకు తరలించి, అక్కడి నుంచి గృహ వినియోగదారులకు, కమర్షియల్ వినియోగదారులకు సరఫరా చేస్తారు. మంగళూరు నుంచి బెంగళూరు వరకు ఉన్న ఎల్పీజీ పైప్‌లైన్ ద్వారా కూడా గ్యాస్ సరఫరా జరుగుతుంది. ఈ విధంగా సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

# రైతు భరోసా నిధులు విడుదల

**మొదటిపేజీ తరువాయి**

చర్యలు ప్రారంభించారు.ఈ చర్యతో రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, సాగు పనులకు ముందస్తు మద్దతు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది.

**తొలి విడతలో 70 లక్షల రైతులకు లాభం**

ప్రభుత్వం విడుదల చేసిన మొదటి విడత నిధుల ద్వారా సుమారు 70 లక్షల మంది రైతులు లబ్ధి పొందనున్నారు. ముఖ్యంగా ఒక ఎకరం వరకు భూమి కలిగిన రైతులకు ప్రాధాన్యతనిస్తూ ఈ నిధులను జమ చేస్తున్నారు.ఈ విడతలో మొత్తం రూ.3,600 కోట్లను విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే ఆదివారం రోజు కావడంతో బ్యాంకింగ్ ప్రక్రియలు పూర్తికాకపోవడంతో, ఈ నిధులు రైతుల ఖాతాల్లో సోమవారం నుంచి జమ అవుతాయి.

**దశలవారీగా మొత్తం నిధుల పంపిణీ**

రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం మొత్తం రూ.9,000 కోట్లను రైతులకు అందించనుంది. తొలి విడతగా విడుదలైన రూ.3,600 కోట్ల తర్వాత, మిగతా మొత్తాన్ని రెండు దశల్లో జమ చేస్తారు.ప్రతి దశలో సుమారు రూ.2,700 కోట్ల చొప్పున నిధులు విడుదల చేయనున్నారు. ఈ ప్రక్రియ వచ్చే 20 రోజుల వ్యవధిలో పూర్తవుతుందని అధికారులు తెలిపారు.

**సిద్దిపేటలో సీఎం పర్యటన**

ఈ కార్యక్రమానికి సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లాలో పర్యటించారు. నర్మెట్టలో జరిగిన రైతు ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన సీఎం, ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి పనిచేస్తోందని తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**రైతు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి**

రైతులను ఆర్థికంగా బలపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. రైతు భరోసా నిధులను గతంతో పోలిస్తే పెంచినట్లు ఆయన తెలిపారు.పంటలకు కనీస మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ కూడా ఇస్తున్నామని వెల్లడించారు. రైతుల ఆదాయం పెంచేందుకు అన్ని విధాలుగా సహకరిస్తున్నామని చెప్పారు.

**భారీ ఖర్చులతో పథకాల అమలు**

రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం భారీ మొత్తాలను ఖర్చు చేస్తోందని సీఎం పేర్కొన్నారు. ప్రతి నెలా రైతుల కోసం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని తెలిపారు.గత 20 నెలల్లో రైతుల కోసం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. పండించిన పంటను పూర్తిగా కొనుగోలు చేయడం ద్వారా రైతులకు నష్టాలు లేకుండా చూస్తున్నామని చెప్పారు.

**పామాయిల్ సాగుకు ప్రోత్సాహం**

రైతుల ఆదాయం పెంచేందుకు పామాయిల్ సాగును ప్రోత్సహిస్తున్నామని సీఎం తెలిపారు. ఇందుకోసం భారీ పెట్టుబడులతో పామాయిల్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇటీవల ప్రారంభించిన ఫ్యాక్టరీతో పాటు, మరిన్ని ప్రాంతాల్లో కూడా ఇలాంటి యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పామాయిల్ సాగుతో రైతులకు మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

**పంటల మార్పిడిపై దృష్టి**

రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా, పంటల మార్పిడిని అనుసరించాలని సీఎం సూచించారు. వరి సాగుతో పాటు ఇతర పంటలపై కూడా దృష్టి పెట్టాలని కోరారు.మిల్లెట్స్, ఆకు కూరలు, పామాయిల్ వంటి పంటలు సాగు చేస్తే మంచి ధర లభిస్తుందని తెలిపారు. పంటల వైవిధ్యం ద్వారా రైతుల ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు.

**గ్రామీణ అభివృద్ధిపై దృష్టి**

ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలన్నది ప్రభుత్వ లక్ష్యమని సీఎం తెలిపారు. ముఖ్యంగా ఆదర్శ గ్రామాలుగా గుర్తింపు పొందిన ప్రాంతాల మాదిరిగా అన్ని గ్రామాలు ఎదగాలని ఆకాంక్షించారు.రైతుల ఆదాయం పెరిగి, వారు ఆర్థికంగా బలపడాలని కోరుకున్నారు. ప్రతి రైతు సుఖసంతోషాలతో జీవించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.రైతు భరోసా నిధుల విడుదలతో తెలంగాణలో వ్యవసాయ రంగానికి మరింత ఊతం లభించనుంది. ప్రభుత్వం చేపడుతున్న చర్యలు రైతులకు నేరుగా ప్రయోజనం చేకూర్చేలా ఉండటంతో, ఈ పథకం రాష్ట్రవ్యాప్తంగా మంచి స్పందన పొందుతోంది. రైతుల ఆదాయం పెంపు, సాగు వ్యయాల తగ్గింపు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు స్పష్టమవుతోంది.



# కృషి చేసిన వారికీ అరుదైనా గౌరవం

ప్రతీ కార్యకర్తను గుండెల్లో పెట్టు కుంటుంది

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో న్యూస్ : డిడి9 వార్త**

ఆదిలాబాద్ జిల్లా లో నూతనంగా కమిటీల ను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కు అరుదైనా గౌరవాన్ని అందించింది పిప్పిరి గ్రామానికి చెందిన ఏనుగు లక్ష్మరెడ్డి కి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్ప గించటం జరిగింది గత అరవై సంవత్సరా లనుండి కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి పార్టీ అభ్యున్నతి కోసం పాటుపడి ముందుకు తీసుకెళ్లే దిశగా కష్ట పడ్డారు. అయన కృషి నీ గమనించి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గా బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఏనుగు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎక్కడ లేనివిదానం గా పార్టీ కోసం శ్రామిస్తున్న ప్రతీ కార్యకర్తకు గౌరప్రదమైన బాధ్యలు ఇచ్చినందుకు వారికీ కృతజ్ఞతలు తెలిపారు అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ లో శ్రామిస్తున్న ప్రతీ కార్యకర్తకు అరుదైనా గౌరవం దక్కుతుంది అని వారు అన్నారు. ఈ బాధ్యత లు అందించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ వారికీ జిల్లా అధ్యక్షులు జాదవ్ నరేష్, కంది శ్రీనివాస్, కాంగ్రెస్ పెద్దలకు మనస్ఫూర్తిగా ప్రతేక కృతజ్ఞతలు తెలిపారు.



# జొన్న,మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించాలని ఎమ్మెల్యేకి రైతుల వినతి.

**బజార్ హత్నూర్, మార్చి 22(డిడి 9వార్త ):-**

ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల కేంద్రంలో రైతులు పండించిన పంటలు అయిన జొన్న, మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేయాలని బజార్ హత్నూర్ సర్పంచ్ పర్చసాయన్న అధ్వర్యంలో మం డలంలోని పలువురు రైతులు ఆదివారం రోజు బోథ్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాథోడ్ అనిల్ కుమార్ కు వినతిపత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా సర్పంచ్ పర్చ సాయన్న, లక్కం శంకర్, చట్ల వినీల్ కుమార్,దుబ్బుల శేకర్, తాంద్ర శ్రీనివాస్, ప్రశాంత్ పాండే, తరుణ్, తదితరులు ఉన్నారు.



# గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వమే నిదర్శనం: పతంగే బ్రహ్మానంద్

**డిడి9 వార్త గుడిహత్నూర్, మార్చి 22:**

గ్రామాల అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తున్నదని అదిలాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. గుడిహత్నూర్ మండల కేంద్రంలోని వార్డు నం.1లో కేంద్ర ప్రభుత్వ నిధులతో, ఎన్ఆర్ఈజీఎస్ (NREGS) పథకం కింద రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన బ్రిడ్జ్ పనులను ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొన్ని ఏళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న ఈ బ్రిడ్జ్ నిర్మాణం గౌరవ ఎంపీ నగేష్ కృషితో సాకారం కావడం ఆనందదాయకమన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పలు సంక్షేమ, మౌలిక వసతుల పథకాలను అమలు చేస్తూ పల్లెలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నదన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. అదే సమయంలో, తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి విషయంలో విఫలమైందని విమర్శించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో గుడిహత్నూర్ బీజేపీ మండల అధ్యక్షులు కేంద్రే శివాజీ, సర్పంచ్ ఆడె షీలా, ఉప సర్పంచ్ నికిల్, రైల్వే బోర్డు సభ్యులు గణేష్ పటేల్, సిద్ధార్థ, ఆడే సునీల్, మాధవ్ పటేల్, వామన్ పటేల్, సంజీవ్ సిర్సాట్, యశ్వంత్, సిడాం తరుణ్, పోచా రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# భవన నిర్మాణ రంగంలో సవరణలు

- **టీడీఆర్ నిబంధనల్లో భారీ సడలింపులు**
- **బిల్డర్లు, డెవలపర్లకు ఉపశమనమిచ్చే నిర్ణయాలు**
- **హై-రైజ్ భవనాల నిర్వచనంలో మార్పులు**
- **టీడీఆర్ వినియోగంపై కొత్త శాతం విధానం**
- **సెట్‌బ్యాక్ నిబంధనల్లో సడలింపులు**
- **ప్లాట్ పరిమాణం ఆధారంగా ఎత్తు అనుమతులు**
- **రోడ్డు వెడల్పు ఆధారంగా అదనపు అంతస్తులకు అవకాశం**
- **నిర్మాణ రంగానికి ఊతమిచ్చే ప్రభుత్వ లక్ష్యం**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**



తెలంగాణ ప్రభుత్వం భవన నిర్మాణ రంగాన్ని మరింత చురుకుగా మార్చేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమివ్వడంతో పాటు, గతంలో అమల్లో ఉన్న కొన్ని కఠిన నిబంధనలను సడలిస్తూ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ముఖ్యంగా ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) వినియోగంపై పెద్ద ఎత్తున మార్పులు చేస్తూ, నిర్మాణ రంగానికి మరింత సౌలభ్యం కల్పించింది.మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ ఈ మార్పులను అధికారికంగా ప్రకటించింది. ఈ కొత్త నిబంధనలు తక్షణమే అమల్లోకి రానున్నాయి. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన ప్రాజెక్టులు తిరిగి ప్రారంభమవుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

**బిల్డర్లకు ఉపశమనం**

ఇప్పటివరకు టీడీఆర్ వినియోగంపై అమల్లో ఉన్న కఠిన నిబంధనల వల్ల బిల్డర్లు, డెవలపర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా టీడీఆర్‌ను ఒకేసారి సమర్పించాల్సిన అవసరం, అధిక శాతం విధానం వంటి అంశాలు ప్రాజెక్టుల ఆలస్యానికి కారణమయ్యాయి. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సడలింపులు ప్రకటించింది.ఇకపై టీడీఆర్‌ను ఒకేసారి సమర్పించాల్సిన అవసరం లేదు. మొత్తం టీడీఆర్‌లో 50 శాతం భవన నిర్మాణ అనుమతి తీసుకునే సమయంలో సమర్పిస్తే సరిపోతుంది. మిగిలిన 50 శాతం భవనం పూర్తయిన తర్వాత, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ తీసుకునే ముందు సమర్పించవచ్చు. ఈ విధానం వల్ల బిల్డర్లపై ఆర్థిక భారం తగ్గనుంది.

**హై-రైజ్ భవనాల కొత్త నిర్వచనం**

భవనాల ఎత్తు విషయంలో కూడా ప్రభుత్వం స్పష్టత తీసుకువచ్చింది. ఇకపై 21 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలను మాత్రమే హైరైజ్ భవనాలుగా పరిగణిస్తారు. అయితే ఈ ఎత్తు లెక్కించేటప్పుడు కొన్ని నిర్మాణ భాగాలను పరిగణలోకి తీసుకోరు. ఉదాహరణకు చిమ్నీలు, వాటర్ ట్యాంకులు, లిఫ్ట్ మెషిన్ రూమ్‌లు, బాయిలర్ గదులు వంటి వాటి ఎత్తు భవనం మొత్తం ఎత్తులో లెక్కించబడదు. దీని వల్ల నిర్మాణ ప్రణాళికలో స్పష్టత ఏర్పడుతుంది.

**టీడీఆర్ వినియోగంపై కొత్త విధానం**

టీడీఆర్ వినియోగంపై ప్రభుత్వం గతంలో అమల్లో ఉన్న 10 శాతం నిబంధనను సవరించింది. భవనాల అంతస్తుల సంఖ్య ఆధారంగా కొత్త శాతం విధానాన్ని అమలు చేస్తోంది. 10 నుంచి 20 అంతస్తుల మధ్య ఉన్న భవనాలకు, 10వ అంతస్తు పై భాగంలో ఉన్న నిర్మాణ విస్తీర్ణంలో కేవలం 3 శాతం టీడీఆర్ వినియోగిస్తే సరిపోతుంది. ఇదే సమయంలో 21 అంతస్తులకుపైగా ఉన్న భవనాలకు 20వ అంతస్తు పైభాగంలో ఉన్న విస్తీర్ణంలో 5 శాతం టీడీఆర్ వినియోగం తప్పనిసరి చేసింది. ఈ మార్పులు పెద్ద భవనాల నిర్మాణాన్ని సులభతరం చేస్తాయని భావిస్తున్నారు.

**సెట్‌బ్యాక్ నిబంధనల్లో సడలింపులు**

సెట్‌బ్యాక్ నిబంధనల్లో కూడా ప్రభుత్వం కొన్ని సడలింపులు ఇచ్చింది. హైరైజ్ భవనాల్లో గరిష్టంగా 10 శాతం వరకు సెట్‌బ్యాక్ తగ్గించుకునే అవకాశం కల్పించింది. అయితే భవనం చుట్టూ కనీసం 7 మీటర్ల ఖాళీ స్థలం ఉండాలనే నిబంధన మాత్రం యథాతథంగా కొనసాగుతుంది.నాన్ హైరైజ్ భవనాలకు కూడా టీడీఆర్ వినియోగం ద్వారా ఇలాంటి సడలింపులు వర్తిస్తాయి. దీని వల్ల స్థల వినియోగం మరింత సమర్థవంతంగా మారుతుంది.

**ప్లాట్ పరిమాణం ఆధారంగా ఎత్తు అనుమతులు**

ప్లాట్ పరిమాణాన్ని బట్టి భవనాల ఎత్తుకు సంబంధించి కూడా కొత్త మార్గదర్శకాలు అమల్లోకి వచ్చాయి. 750 చదరపు మీటర్ల నుంచి 2000 చదరపు మీటర్ల వరకు ఉన్న ప్లాట్లలో, 18 మీటర్ల నుంచి 21 మీటర్ల వరకు ఎత్తు పెంపు టీడీఆర్ ద్వారా మాత్రమే అనుమతిస్తారు.ఈ విధానం వల్ల చిన్న మరియు మధ్య తరహా ప్రాజెక్టులకు కూడా అభివృద్ధి అవకాశాలు పెరుగుతాయి.

**రోడ్డు వెడల్పు ఆధారంగా అదనపు అంతస్తులు**

పెద్ద ప్లాట్లలో అదనపు అంతస్తుల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం కొత్త వెసులుబాటు కల్పించింది. 2000 చదరపు మీటర్లకు పైగా ఉన్న ప్లాట్లలో రోడ్డు వెడల్పును బట్టి అదనపు అంతస్తులకు అనుమతి ఇస్తారు.40 అడుగుల రోడ్డు ఉన్న చోట మూడు అదనపు అంతస్తులు నిర్మించుకోవచ్చు. 60 అడుగుల రోడ్డు ఉంటే నాలుగు అంతస్తులు, 80 అడుగుల కంటే ఎక్కువ వెడల్పు ఉన్న రోడ్డు పక్కన ఐదు అదనపు అంతస్తుల వరకు నిర్మాణానికి అనుమతి ఉంటుంది.ఈ మార్పులు నగరాల్లో భూమి వినియోగాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి.

**మాస్టర్ ప్లాన్ మార్పులకు కొత్త ఎంపిక**

మాస్టర్ ప్లాన్‌లో రోడ్ల మార్పులు లేదా తొలగింపులు జరిగితే, దరఖాస్తుదారులకు రెండు ఎంపికలు ఇవ్వబడ్డాయి. వారు నిర్ణీత ఛార్జీలు చెల్లించవచ్చు లేదా దానికి సమానమైన టీడీఆర్‌ను సమర్పించవచ్చు.ఈ విధానం వల్ల ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు, అభివృద్ధి పనులు కూడా సులభతరం అవుతాయి.

**నిర్మాణ రంగానికి ఊతం**


ఈ కొత్త మార్పులు రాష్ట్రంలో భవన నిర్మాణ రంగానికి పెద్ద ఊతంగా మారనున్నాయి. ముఖ్యంగా టీడీఆర్ అందుబాటులో లేక నిలిచిపోయిన ప్రాజెక్టులు తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉంది.రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెరగడంతో పాటు, ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది. నగరాభివృద్ధి వేగవంతం కావడంతో పాటు, ప్రణాళికాబద్ధమైన నిర్మాణాలకు ఈ మార్పులు దోహదపడతాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాలు నిర్మాణ రంగాన్ని సులభతరం చేయడంతో పాటు, పెట్టుబడులను ఆకర్షించే దిశగా కీలక పాత్ర పోషించనున్నాయి. భవిష్యత్తులో తెలంగాణ నగరాలు మరింత ఆధునికంగా, సమగ్రంగా అభివృద్ధి చెందేందుకు ఇవి దోహదపడతాయని నిపుణులు భావిస్తున్నారు.

# బోథ్ మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం మంజూరు.



**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మార్చ్ 22(డి డి 9)**

బోథ్ మండల ప్రజల చిరకాల కోరిక అయిన అగ్నిమాపక కేంద్రం స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాము. ప్రజా ప్రభుత్వంలో ప్రజా పాలనను సమర్థంగా కొనసాగిస్తున్న గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ఈ కీలక నిర్ణయం తీసుకోవడం అభినందనీయం. ఈ అగ్నిమాపక కేంద్రం మంజూరుకు సహకరించిన జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు గారికి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారి గారికి, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గజేందర్ గారికి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి గారికి, డీసీసీ అధ్యక్షులు నరేష్ జాధవ్ గారికి, మాజీ ఎంపీ సోయం బాపు రావు గారికి, అలాగే శేషాద్రి నాయుడు గారికి బోథ్, నేరడిగొండ, సోనాల మండలాల ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గజేందర్ అన్న గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. ఈ అగ్నిమాపక కేంద్రం మంజూరులో ఆయన చేసిన కృషి, పట్టుదల ఎంతో అభినందనీయం. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే నాయకత్వం ఆయనదే. ఈ అగ్నిమాపక కేంద్రం కోసం మొత్తం 18 మంది సిబ్బందిని నియమించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందులో స్టేషన్ ఫైర్ ఆఫీసర్, లీడింగ్ ఫైర్‌మన్, డ్రైవర్ ఆపరేటర్, ఫైర్‌మన్, జూనియర్ అసిస్టెంట్ మరియు స్వీపర్ పోస్టులు ఉన్నాయి. ఈ యూనిట్ నిర్వహణకు సంవత్సరానికి సుమారు రూ.110.46 లక్షలు, ప్రారంభ ఏర్పాట్ల కోసం రూ.303.35 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగింది. ఈ అగ్నిమాపక కేంద్రం స్థాపనతో బోథ్ మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన సేవలు అందుబాటులోకి రావడం ద్వారా ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ మరింత బలపడుతుంది. బోథ్ నియోజకవర్గ ప్రజల తరపున మరోసారి రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, బోథ్ సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్, ఆత్మ డైరెక్టర్ రహీముద్దీన్, మెరుగూ నరసింహా దాస్, చట్ల ఉమేష్, మొహమ్మద్ అబ్రార్, అలపాటి అచ్యుతానంద రెడ్డి, పన్నాల శ్యామేందర్, డీసీసీ కార్యదర్శి వినయ్ రెడ్డి, యూసుఫ్ ఖురేషీ, సామ వినోద్ రెడ్డి, బోథ్ వార్డు సభ్యులు రాయల్ తిరుపతి, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.



dates 16.8.2021 and 18-03-2025.

*****

ORDER:

In the letter read above, the Director General, Telangana State Disaster Response and Fire Services, Hyderabad has requested for establishment of new Fire Station in Boath Mandal headquarters Adilabad District, Telangana State and accord sanction for the appointment of (18) personnel on regular basis for single unit Fire Station with Officers / Personnel with the recurring expenditure of Rs.110.46 lakhs per annum and Non-recurring expenditure of Rs.303.35 lakhs during the financial year 2025-2026.

2. After careful examination of the matter, Government, hereby accord sanction for establishment of new Fire Station in Boath Mandal headquarters Adilabad District, Telangana State and accord sanction for the appointment of 18 personnel on regular basis for single unit Fire Station with Officers/ Personnel with the recurring expenditure of Rs.110.46 lakhs per annum and Non-recurring expenditure of Rs.303.35 lakhs during the financial year 2025-2026 as detailed below for maintaining the above Fire Station:

| Sl. No | Name of the Post | No. of posts To be sanctioned | Scale of Pay |
|---|---|---|---|
| 1. | Station Fire Officer | 01 | 38890-112510 |
| 2. | Leading Fireman | 02 | 31040-92050 |
| 3 | Driver operator | 03 | 31040-92050 |
| 4 | Fireman | 10 | 24280-72850 |
| 5 | Junior Assistant | 01 | 24280-72850 |
| 6 | Sweeper | 01 | 19000-58850 |

# నర్మెట్ట రైతు ఉత్సవాలకు బయలుదేరిన బీర్కూర్ మండల రైతులు

**బీర్కూర్, మార్చి 22(డిడి9 వార్త):**

సిద్దిపేట జిల్లా నర్మెట్టలో నిర్వహిస్తున్న రైతు ఉత్సవాలు, పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి బీర్కూర్ మండలానికి చెందిన రైతులు ఆదివారం ప్రత్యేక వాహనాల్లో బయలుదేరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై బహిరంగ సభలో పాల్గొననున్నారు. మండల వ్యవసాయ అధికారుల సమక్షంలో బరంగ్ ఏడిగి గ్రామానికి చెందిన రైతులు ఈ పర్యటనకు తరలివెళ్లారు. ఆధునిక వ్యవసాయ విధానాలు, పామాయిల్ సాగు పద్ధతులు మరియు వ్యవసాయంలో కొత్త సాంకేతికతలపై అవగాహన పెంపొందించేందుకు ఈ పర్యటన ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గొండ్ల రాజు, కుమ్మరి గంగారం, మేత్రి నాగొండ, దశరథ్, హనుమ గొండ, శివరాజులు, గజేందర్, లింగప్ప, రచ్చ ఆంజనేయులు,రాములు తదితరులు పాల్గొన్నారు.



# కారేగాం గ్రామంలో సాంప్రదాయ పూర్వకంగా వస్తున్న కుస్తీ పోటీలు నిర్వహించారు

**నిజాంబాద్ పోతంగల్ మార్చ్22:(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని కారేగం గ్రామంలో సాంప్రదాయ పూర్వకంగా వస్తున్న కుస్తీ పోటీలు జరుపుకోవడం జరుగుతుంది. ఈరోజు గ్రామ గ్రామ పెద్దల సమక్షంలో కుస్తిల పోటీ నిర్వహించడం జరిగింది. ఇట్టి కుస్తీలు 100 రూపాయల కుస్తీలు 10 . 200 రూపాయిల కుస్తీలు 8.300 ల కుస్తీలు 6..500 ల కుస్తీలు 5.ఆఖరి కుస్తీ 750 రూపాయిలు.జరిగింది ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ఉన్న గ్రామాలు యువకులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొనడం జరిగింది.








# షాహిద్ దివాస్ సందర్భంగా బీర్కూరులో శ్రమదానం

**బీర్కూర్, మార్చి 22(డిడి9 వార్త):**

మేరా యువభారత్ ఆధ్వర్యంలో బీర్కూర్ మండల కేంద్రంలో షాహిద్ దివాస్ సందర్భంగా శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సునీల్ రాథోడ్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో అనేక మంది త్యాగధనులు తమ ప్రాణాలను అర్పించి దేశానికి స్వేచ్ఛను తీసుకువచ్చారని తెలిపారు. దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరుల సౌర్యం, త్యాగం, నిబద్ధతను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం షాహిద్ దివాస్‌ను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన కామ్రేడ్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల త్యాగాలను గుర్తుచేసుకుంటూ శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా కామ్రేడ్ భగత్ సింగ్ మరియు నేతాజీ సుభాష్ చంద్ర బోస్ విగ్రహాలను నీటితో శుభ్రం చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో PDSU జిల్లా అధ్యక్షులు ఎన్. బాలరాజ్, బీర్కూర్ గ్రామ సర్పంచ్ అరిగే ధర్మతేజ, వార్డు మెంబర్ నవీన్, గ్రామ యువకులు వెంకట్, బాలకృష్ణ, రమేష్, కోర్రి కృష్ణ, సురేష్, గంగాధర్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు. అలాగే PDSU నాయకులు సాయికుమార్, శేఖర్, విహాన్ కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.






# పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి

**నిజామాబాద్ జిల్లా 22మార్చి(డీడీ9 వార్త) :**

ఆర్థిక స్తోమత లేక వైద్యం పొందలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా అండగా నిలవడం తన బాధ్యతని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్‌లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మొత్తం 185 మంది లబ్ధిదారులకు రూ. 56,20,500 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఈ నిధి ఎంతో భరోసా నిస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ సాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియలో ఎటువంటి జాప్యం జరగకుండా తన బృందం నిరంతరం క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటుందని, సేకరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు సెక్రటేరియట్‌కు పంపించి గరిష్ట స్థాయిలో ఆర్థిక సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీపై ఎమ్మెల్యే తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గడిచిన నాలుగేళ్లలో నియోజకవర్గంలో ఒక్క ఇల్లు కూడా లబ్ధిదారులకు ఇవ్వలేదని, నాగారంలోని 396 ఇళ్లు, కలెక్టరేట్ సమీపంలోని మరో 200 ఇళ్లు నిర్మించి సిద్ధంగా ఉన్నప్పటికీ అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఏళ్లు గడుస్తున్నా పంపిణీ చేయకపోవడంతో ఆ ఇళ్ల కిటికీలు, తలుపులు చోరీకి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రజా సమస్యను ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అసెంబ్లీలో కూడా ప్రస్తావించినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జగదీష్ కులకర్ణి, మఠం పవన్, చింతకాయల రాజేందర్, ఇప్పకాయల కిషోర్, దాంపల్లి జ్యోతి మురళి, బొబ్బిలి సుమిత్ర వేణు, కలిపే అర్చన చిరంజీవి, బంటు ప్రీతి ప్రవీణ్, బీజేపీ నాయకులు బద్దం కిషన్, పుట్ట వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.





# యోగతోనే సంపూర్ణ ఆరోగ్యం

**నిజామాబాద్ జిల్లా 22మార్చి(డీడీ9 వార్త) :**

యోగాభ్యాసంతోనే మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని యోగా సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం భీమ్‌గల్ మండల కేంద్రంలోని లింబాద్రి గుట్టపై యోగా సభ్యుల ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ... నిత్యం యోగాసనాలు, ధ్యానం చేయడం వల్ల దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చని తెలిపారు. వెన్నునొప్పి, మెడ నొప్పి, నిద్రలేమి, తలనొప్పి వంటి సమస్యలకు యోగా అద్భుత పరిష్కారమని వివరించారు. ప్రస్తుత కాలంలో ఒత్తిడిని జయించడానికి, ఏకాగ్రతను పెంచుకోవడానికి యోగా ఎంతో దోహదపడుతుందన్నారు. లింబాద్రి గుట్టపై నిర్వహించిన గిరిప్రదక్షిణలో సభ్యులు భక్తి పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ధ్యాన ముద్రలో సాగారు. అనంతరం ప్రకృతి సిద్ధమైన అమృత ఆహారాన్ని స్వీకరించారు. భీమ్‌గల్ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ప్రతిరోజూ ఉదయం యోగా శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యోగా సభ్యులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆధ్యాత్మిక వేడుకలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

**నిజామాబాద్ జిల్లా 22మార్చి(డీడీ9 వార్త) :**



నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డికి ఆదివారం నియోజకవర్గంలోని పలు ఆధ్యాత్మిక వేడుకల ఆహ్వానాలు అందాయి. మండలాల వారీగా ప్రముఖ దేవాలయాల కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు. జక్రాన్ పల్లి మండలం తొర్లికొండ గ్రామంలో కొలువై ఉన్న ప్రసిద్ధ శిలాతీర్థ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 27న నిర్వహించనున్న స్వామివారి మహా రథయాత్రకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యేకు అధికారికంగా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కిరణ్ అనుపమ్, ప్రముఖ నాయకులు శ్రీనివాస్ గౌడ్, నల్ల గంగారెడ్డి, నర్సారెడ్డి, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

**మాధవ్ నగర్‌లో**

**సాయిబాబా జన్మోత్సవ వేడుకలు**

డిచ్‌పల్లి మండలం మాధవ్ నగర్‌లోని సాయిబాబా ఆలయంలో ఈ నెల 27న నిర్వహించనున్న స్వామివారి జన్మోత్సవ వేడుకలకు రావాలని ఆలయ ఈఓ రవీందర్, అర్చకులు మాణిక్య శర్మ ఎమ్మెల్యేను ఆహ్వానించారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసిన వారు, వేడుకల విశిష్టతను వివరించి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆహ్వాన పత్రికను అందజేసి భక్తుల సమక్షంలో జరిగే ఈ వేడుకను విజయవంతం చేయాలని కోరారు.





# మాజీ జెడ్పిటిసి పుప్పల శంకర్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న మాజీ ఎంపీ బిబి పటేల్

**నిజామాబాద్ పోతంగల్ మార్చ్ 22(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని హెగ్డోలి గ్రామానికి చెందిన మాజీ జెడ్పిటిసి పుప్పల శంకర్ నీ ఆదివారం పరామర్శించిన తెలంగాణ రాష్ట్ర మాజీ ఎంపీ బీబీ పటేల్ ఆయన మాట్లాడుతూ పుప్పల శంకర్ గారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. దీంతో ఆయనను ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ ఎంపీ బిబి పటేల్. సర్పంచ్ నాగరాజు. విజయ పటేల్. బాల్ ఠాక్రే. పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ

# నిధుల తోనే సాధ్యం.

- **బజార్ హత్నూర్ బిజెపి మండల అధ్యక్షులు పోరెడ్డి శ్రీనివాస్**

**బజార్ హత్నూర్, మార్చి 22(డిడి 9వార్త ):-**

ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం లోని దేగామ గ్రామంలో పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ కృషి ఫలితంగా రూపాయలు 5,00,000 ఉపాధి హామీ పథకం నిధుల ద్వారాసర్పంచ్ గూడా పాఠశాల ప్రహరీ గోడ పనులను సర్పంచ్ దుర్వ దేవుబాయి, ఉప సర్పంచ్ బొడ్డు భోజన్నతో కలసి బజార్ హత్నూర్ బిజెపి మండల అధ్యక్షులు పోరెడ్డి శ్రీనివాస్ ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో అభివృద్ధి జరగాలి అంటే కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలతోనే అని అన్నారు.పల్లెలన్ని పచ్చగా మారుతున్నాయనిబిజెపి పాలిత ప్రాంతాలలో ప్రజలు ఎంతో శుఖ సంతోషాలతో ఉన్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో బజార్ హత్నూర్ బిజెపి మండల నాయకులు వెంకన్న, నానం రమణ, ఈశ్వర్, గ్రామస్థులు దుర్వ మాణిక్, మధు తదితరులు పాల్గొన్నారు.



# కట్ట పోచమ్మ ఆలయ నిర్మాణానికి స్థలం విరాళం

**బోధన్, నిజామాబాద్ జిల్లా 22మార్చి(డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలోని 28వ వార్డులో గల కట్ట పోచమ్మ (వేయి కళ్ల పోచమ్మ) ఆలయ నిర్మాణానికి ఆదివారం అంకురార్పణ జరిగింది. నూతన ఆలయ నిర్మాణ పనులను భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అజయ్ వడియార్ దేశాయ్, ఆలయ నిర్మాణం కోసం తన వంతుగా స్థలాన్ని విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించి ఉదారత చాటుకున్న అజయ్ దేశాయ్‌కి స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వీడీసీ ప్రతినిధులు మాట్లాడుతూ.. అందరి సహకారంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. భక్తులు, కాలనీ పెద్దలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు గంగాధర్ రావు పట్వారీ, ప్రధాన కార్యదర్శి బీర్కూర్ శంకర్, కోశాధికారి గమరపేలేట శ్రీను, సభ్యులు పోశెట్టి, సంగ్రామ్, కట్ట మీద గంగారాం, శేఖర్, అజయ్, ప్రవీణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# స్నేహితుడు మృతి... కుటుంబానికి చేయూతగా నిలిచిన చిన్ననాటి స్నేహితులు


**బీర్కూర్,మర్చి 22(డిడి9 వార్త):**



బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామానికి చెందిన డి. మహేందర్ ఇటీవల జరిగిన రైలు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసి గ్రామంలో విషాదం నెలకొంది. మహేందర్ మృతి పట్ల అతని చిన్ననాటి స్నేహితులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మహేందర్ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని గుర్తించిన చిన్ననాటి స్నేహితులు తమవంతుగా చేయూత అందించాలని నిర్ణయించారు. స్నేహితులంతా కలిసి రూ.23,500లను సేకరించి మహేందర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. స్నేహితులు అందించిన ఈ ఆర్థిక సహాయం కుటుంబానికి కొంతమేర ధైర్యం కలిగిస్తుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో భారత్, విజయ్, గంగరాజులు, విట్టల్, అనిల్ తదితర స్నేహితులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్-ప్రెసిడెంట్ బగునూరే. మాధవ్ రావ్ పటేల్ కు పొన్న గ్రామస్తుల ఘన సన్మానం.

**పొన్న 22 మార్చ్ (డిడి9 వార్త న్యూస్ ):**



సిరికొండ మండలం పొన్నా గ్రామంలో గ్రామస్తులందరూ కలిసి బగునూరే మాధవ్ పటేల్ కు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ గా మాధవ్ పటేల్ కు చోటు దక్కడం చాలా ఆనందంగా ఉందని, కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఒక కార్యకర్తగా ఇప్పటివరకు ఏ పార్టీకి మారకుండా కాంగ్రెస్ పార్టీకి సేవలు చేసినందుకుగాను ఆయన సేవలను గుర్తించి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ మాధవ్ పటేల్ కు అదిలాబాద్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పదవి ఇచ్చినందుకు వారికి పొన్న గ్రామస్తులు అందరూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మా పొన్న గ్రామానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పదవి రావడం మాకు చాలా గర్వకారణంగా ఉందని గ్రామస్తులు ఉన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అందరూ కలిసి ఆయనకు శాలువా కప్పి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకొని ఆ ఆనందంలో టపాసులు కాల్చారు. మాధవరావు పటేల్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని గ్రామస్తులు అన్నారు . ఈ సందర్భంలో పొన్న గ్రామస్తులు,పెద్దలు, యువకులు,తదితరులు పాల్గొన్నారు.







## వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలను జయప్రదం చేయండి

**బోధన్, నిజామాబాద్ జిల్లా 22మార్చి(డీడీ9 వార్త) :**

కామారెడ్డిలో ఈ నెల 24, 25 తేదీలలో నిర్వహించనున్న అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రథమ మహాసభలకు వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకుడు జి.సీతారాం పిలుపునిచ్చారు. ఆదివారం బోధన్ పట్టణంలో మహాసభల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 24న మధ్యాహ్నం 12 గంటలకు కామారెడ్డి మున్సిపల్ మైదానం నుంచి గంజి వరకు భారీ ప్రదర్శన ఉంటుందని, అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు వీక్లీ మార్కెట్ ఆవరణలో బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సభకు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జిల్లా కార్యదర్శి వి.ప్రభాకర్, ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ తదితరులు హాజరై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. 25న జరిగే ప్రతినిధుల సభలో ఆర్థిక విశ్లేషకులు మీ పాపారావు ప్రారంభ ఉపన్యాసం చేస్తారని, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లపై కేజీ రామచందర్ చర్చిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సిహెచ్. రమేష్, మండల నాయకులు బి.సాయిలు, లక్ష్మణ్, పోశెట్టి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ధన్నూర్ మార్గం గుంతలమయం – అడెల్లి మహా పోచమ్మ భక్తులకు తీవ్ర ఇబ్బందులు.

- **పోచమ్మ ఆలయం ఎగ్జిక్యూటివ్ అధికారికి సమస్యను విన్నవించిన దేగామ ఉప సర్పంచ్ బొడ్డు భోజన్న.**
- **సమస్య విన్న వెంటనే స్పందించిన ఈఓ**
- **త్వరలోనే మరమ్మతులకు హామీ.**

**బజార్ హత్నూర్, మార్చి 22(డిడి9వార్త ):-**

నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని భక్తుల ఆరాధ్య దైవం అడెల్లి మహా పోచమ్మ ఆలయానికి వెళ్లే అంతర్ జిల్లా రహదారి ధన్నూర్ గ్రామం గుండా వెళ్లే మార్గం.ఇది గుట్ట ప్రాంతంలో ప్రస్తుతం పూర్తిగా గుంతలమయంగా మారింది. ఈ దారిలో ప్రయాణించడంకష్టసాధ్యంగా మారింది. ఆదిలాబాద్ జిల్లా వైపు నుంచి మహారాష్ట్రం తదితర దూర ప్రాంతాలనుంచి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సమస్యను ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండలంలోని దేగామ గ్రామఉపసర్పంచ్ బొడ్డు భోజన్నతో పాటుగా కొంతమంది గ్రామస్తులు అడెల్లి మహా పోచమ్మ ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారుల దృష్టికి ఆదివారం రోజు తీసుకెళ్లారు. అక్కడ ఉన్న పరిస్థితిని వివరించివెంటనే చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు.ఈ విషయం పై స్పందించినఆలయం ఈఓ, సమస్య తీవ్రతను గుర్తించి త్వరలోనే రహదారి మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతమైన మార్గం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.భోజన్న తో పాటుగా ఓర్నీ రాజేశ్వర్, పడిపెల్లి మహేష్లు, పలువురు భక్తులు తదితరులు ఉన్నారు.





## నేరడిగొండ మండలంలో అగ్నిప్రమాదం,రైతు కొట్టం దగ్ధం

**ఆదిలాబాద్,నేరడిగొండ మార్చ్ 22(డి డి 9):-**


మండలంలోని తర్నం (కె) గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో రైతుకు చెందిన కొట్టం పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు రాజేందర్ రెడ్డికి చెందిన ఇంటి పక్కన ఉన్న కొట్టంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి, కొద్ది సేపట్లోనే విస్తరించి భారీ నష్టాన్ని మిగిల్చాయి. స్థానికుల కథనం ప్రకారం, కొట్టంలో ఒక్కసారిగా మంటలు అంటుకోవడంతో గ్రామస్తులు వెంటనే అప్రమత్తమై వాటిని ఆర్పేందుకు ప్రయత్నించారు. అయితే ఎండ తీవ్రతకు తోడు గాలులు బలంగా వీయడంతో మంటలు అదుపు తప్పి వేగంగా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో కొట్టం పైకప్పు, కలప సామాగ్రి, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. దీంతో బాధిత రైతుకు గణనీయమైన ఆస్తి నష్టం సంభవించింది. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. సమాచారం అందుకున్న రెవెన్యూ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని నష్టాన్ని పరిశీలించారు. పంచనామా నిర్వహించి సంబంధిత అధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. బాధిత రైతును ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## మహాదేవుని మందిరానికి కొత్తపంపు మోటర్ కొనిచ్చిన హనుమాన్ స్వాములు.

**బజార్హత్నూర్, మార్చి 22(డిడి9వార్త ):-**

బజార్ హత్నూర్ మండల కేంద్రంలోని పురాతనశివాలయంలో చేతి పంపుతో పాటు కరెంటు తో నడిచే ఒక బోరుబావి కూడా ఉంది. అయితే బోరుబావిలోని పంపుమోటర్ చెడిపోయి, పనికి రాకుండా పోవడంతో ఈ విషయం గమనించిన హనుమాన్ దీక్ష స్వీకరణ చేసిన హనుమాన్ స్వాములు ఒక ఆలోచన చేసి దానికి సరిపడా డబ్బులు సమీకరించిఒక కొత్త కరెంటు పంపిసెట్ కొని తెచ్చి బిగింపచేశారు.ఈ కార్యక్రమంచేపట్టి పూర్తి చేసిన హనుమాన్ స్వాములకు పలువురు గ్రామ ప్రజలు అభినందనలు చెప్పారు.



## బీర్కూరులో బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



**బీర్కూర్, మార్చి 22(డిడి9 వార్త):**

బీర్కూర్ మండల మాజీ ఎంపీపీ తిలకేశ్వరి రఘు ని, బీర్కూర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పొట్లూరి ఆనంద్ ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల బీర్కూర్ మండల మాజీ ఎంపీపీ తిలకేశ్వరి రఘు కుమారుడు తిలకేశ్వరి రమాకాంత్ మృతిచెందిన విషయం తెలుసుకున్న పోచారం శ్రీనివాసరెడ్డి ఆదివారం బీర్కూర్ లోని వారి నివాసానికి వెళ్లి రఘుని మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం బీర్కూర్ గ్రామపంచాయతీ ప్రకాశరావు క్యాంపుకు చెందిన వార్డు సభ్యుడు పొట్లూరి ఆనంద్ కుమారుడు పొట్లూరి లలిత్ ఆర్యన్ మరణించడంతో నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమానికి పోచారం శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా లలిత్ ఆర్యన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో బీర్కూర్ మండలానికి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఈ నెల 29న బోధన్‌లో హిందూ సమ్మేళనం

**బోధన్, నిజామాబాద్ జిల్లా 22మార్చి(డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలో ఈ నెల 29న హిందూ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఆదివారం పట్టణంలో జరిగిన కమిటీ సమావేశంలో ఈ కార్యక్రమ ఏర్పాట్లపై చర్చించారు. ఈ నెల 29న సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివాలయం ఆవరణలో సమ్మేళనం ప్రారంభం కానుందని, ఈ సందర్భంగా భక్తులందరితో కలిసి సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక వేడుకకు ముఖ్య అతిథిగా గీత యజ్ఞం ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ విశ్వక తీర్థ స్వామి విచ్చేస్తుండగా, ప్రధాన వక్తగా తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ ప్రసంగించనున్నారు. కార్యక్రమానికి అధ్యక్షులుగా రాజేశ్వరరావు, గౌరవ అధ్యక్షులుగా అజయ్ వడియార్ వ్యవహరిస్తారని కమిటీ పేర్కొంది. బోధన్ పట్టణంలోని భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.



## జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి కలిసిన రుద్రూర్ నాయకులు

**రుద్రూర్:**

నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగేష్ రెడ్డి నీ శుక్రవారం రుద్రూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. రుద్రూర్ మాజీ విండో చైర్మెన్ పత్తి రాము కు కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గా నియమించారు. నూతనంగా ఎన్నిక చేసినందుకు పత్తి రాము జిల్లా అధ్యక్షులు నగేష్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.వీరితో పాటు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట అరుణ్ కుమార్,మాజీ జెడ్పీటీసీ నారోజీ గంగారాం,నాయకులు సంగయ్య, అక్కపల్లి నాగేందర్ ఉన్నారు.



# ఏజ్ జస్ట్ నంబర్ అనిపిస్తున్న రజినీకాంత్.. కుర్ర హీరోయిన్‌తో రొమాన్స్‌కు ఫ్యాన్స్ ఫిదా

సినిమా ఇండస్ట్రీలో హీరోలు ఎక్కువ శాతం తమకంటే వయసులో చిన్నవారితో కలిసి నటిస్తుంటారు. అలా నటించే సమయంలో ఆ ఇద్దరి జోడీ సరిగ్గా కుదరకపోతే ప్రేక్షకులు డిస్కనెక్ట్ అవుతారు. ఇంత వయసు తేడా ఉన్నవారు హీరో, హీరోయిన్లుగా నటించడం కరెక్ట్ కాదు అని కామెంట్స్ కూడా వస్తుంటాయి. కానీ కొంతమంది హీరోలు మాత్రం తమకంటే వయసులో చాలా చిన్నవారితో నటించి కూడా ప్రేక్షకుల ప్రశంసలను పొందుతారు. అలా ప్రశంసలను పొందిన జంటలు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో చాలానే ఉన్నాయి.

అలాంటి జోడీనే రజనీకాంత్, సోనాక్షి సిన్హా. కొన్ని సంవత్సరాల క్రితం రజనీకాంత్ హీరోగా రూపొందిన లింగ చిత్రంలో సోనాక్షి సిన్హా హీరోయిన్ గా నటించింది. ఈ సినిమా 2014లో విడుదలైంది. ఆ సమయంలో రజినీకాంత్ వయస్సు 64 కాగా, సోనాక్షి సిన్హా వయసు కేవలం 27 మాత్రమే. దాంతో ఈ సినిమా స్టార్ట్ కావడానికి ముందు ఈ ఇద్దరి మధ్య వయసు తేడా చాలా ఉంది, ఈ జోడీ స్క్రీన్ పై కనిపించినప్పుడు వారి మధ్య కెమిస్ట్రీ బాగోలేకపోతే అదే సినిమాకు మైనస్ అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయని కొంతమంది అభిప్రాయపడ్డారు.

కానీ సినిమా విడుదల అయిన తర్వాత ఈ మూవీ ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది కానీ, ఈ జంట మాత్రం జనాలను బాగా అలరించింది. వీరి మధ్య వచ్చిన పాటలు, రొమాంటిక్ సన్నివేశాలు, ఇతర సన్నివేశాలు అన్నీ కూడా ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దాంతో ఆ సమయంలో రజినీకాంత్ వయసు విషయంలో చాలామంది పాజిటివ్ గా స్పందించారు. లింగ చిత్రంలో అనుష్క కూడా హీరోయిన్ గా నటించింది. కె.ఎస్. రవి కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందించారు.



# ఆదిత్య ధర్ నీకు సెల్యూట్



చిత్రపరిశ్రమలోకి రావాలనే ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు ఆదిత్యధర్ అంటూ ఆయనపై ప్రశంసల వర్షం కురిపించింది ప్రముఖ కథానాయిక కంగనా. 'ధురంధర్ ది రివెంజ్' చిత్రాన్ని దర్శకుడు ఆదిత్యధర్ తీర్చిదిద్దిన తీరుకి ఆమెకు ఎంతగానో నచ్చిందంటూ ఇన్‌స్టా స్టోరీలో తన అభిప్రాయాల్ని పంచుకుంది. "'ధురంధర్' విజయంలో గొప్ప విషయం ఏమిటంటే ఆదిత్య ధర్ ఒక సూపర్ స్టార్ దర్శకుడిగా మంచి పేరు సంపాదించుకున్నారు. హాలీవుడ్ స్టార్ దర్శకులు ఎల్లప్పుడూ నటుల కంటే గొప్పవారు. కానీ, మనం మన చిత్రనిర్మాతలకు ఎప్పుడూ తగినంత గౌరవం, గుర్తింపు ఇవ్వము. వాళ్లు ఎంత కష్టపడినా తక్కువ జీతాలే పొందుతారు. అంతేకాదు సూపర్ స్టార్ల చేత వేధింపులకు కూడా గురవుతారు. దాని ఫలితంగానే ఇండస్ట్రీలో నిర్మాతగానో, సినిమాటోగ్రాఫర్‌గానో మరే ఇతర సాంకేతిక నిపుణుడిగానో కావాలని కలలు కనే ఏ యువకుణ్ని (ఇన్‌సైడర్, అవుట్‌సైడర్) నేను కలవలేదు. ప్రతి ఒక్కరూ తాము ప్రతిభావంతులమని చెప్పుకుంటారు. కానీ, వారు కేవలం నటులు కావాలని మాత్రమే కోరుకుంటారు. ఇప్పుడు ఇక్కడ హీరోల కన్నా ఎక్కువగా వెలిగిపోతున్న ఒక సూపర్ స్టార్ దర్శకనిర్మాత ఉన్నారు. ఈరోజు ఎంతోమంది యువత ఆయన రూపొందించిన కథను చూస్తున్నారు. వారు ఆయనలా అవ్వాలని ఆకాంక్షించి చిత్రపరిశ్రమను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తారు!! సెల్యూట్ ఆదిత్య ధర్" అని ఆ పోస్ట్‌లో రాసింది కంగనా.

# ఎన్టీఆర్ పురస్కారం గొప్ప గౌరవం

తెలుగు సినిమా కీర్తిని ఖండాంతరాలకు చేర్చిన మహానుభావుడు ఎన్టీఆర్ అని, ఆయన పేరుతో ఉన్న ఎన్టీఆర్ జాతీయ పురస్కారం తనకు దక్కడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు ప్రముఖ నటుడు చిరంజీవి. చరిత్ర కర్తగా నిలిచిన ఎన్టీఆర్, తన పేరుతోనే లలిత కళల్ని ముందుకు తీసుకెళ్లిన మహా కళాకారుడంటూ ఎక్స్ వేదికగా కీర్తించారు. ఉగాది రోజున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రదానం చేసిన గద్దర్ సినీ పురస్కారాల్లో ఎన్టీఆర్ జాతీయ పురస్కారాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా చిరంజీవి అందుకున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా చిరంజీవి ఎక్స్‌లో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు.

"దేవుడు ఎలా ఉంటాడో మనకు తెలియకపోయినా, ఆయన పోషించిన పాత్రలతో దేవుడిని మన కళ్ల ముందుంచిన అపూర్వ ప్రతిభాశాలి. నాట్యం, తాళం, రాగం... కళల సమ్మేళనమే ఎన్టీఆర్ అంటే! రామారావు జన్మించిందే సినిమాలకోసం అన్నట్టుగా, ఆయన లేని తెలుగు సినిమా ఊహించలేనిది" అంటూ ఆ పోస్ట్‌లో ఎన్టీఆర్‌ని కీర్తించారు చిరంజీవి. ప్రతిష్ఠాత్మకమైన ఈ పురస్కారాన్ని చిరంజీవి స్వీకరించిన సందర్భంగా ఆయన తనయుడు, ప్రముఖ కథానాయకుడు రామ్‌చరణ్ కూడా సామాజిక మాధ్యమాల వేదికగా స్పందిస్తూ "ఎన్టీఆర్ జాతీయ పురస్కారంతో నా తండ్రిని సత్కరించడం మా కుటుంబానికి అత్యంత గర్వకారణం. అదొక భావోద్వేగ క్షణం. ఈ పురస్కారం ఎంతో ప్రత్యేకమైనది. ప్రతిభని గుర్తించి, ఘనంగా పురస్కార వేడుకని నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వానికీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికీ కృతజ్ఞతలు" అంటూ పోస్ట్‌ని పంచుకున్నారు.



# కొందరు రాజులు ఎప్పటికీ మరణించరు!

'శంబాల' విజయంతో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించారు దర్శకుడు యుగంధర్ ముని. దీన్ని మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మించిన సంగతి తెలిసిందే. ఇప్పుడిదే కాంబోలో మరో సోషియో ఫాంటసీ సినిమా పట్టాలెక్కనుంది. సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని శనివారం అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు ఓ కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. యుద్ధభూమిలో ఓ సింహం, తోడేలు పోరుకు సిద్ధమవుతున్నట్లు చూపించడం.. ఆ రెండింటి మధ్య ఓ పురాతన ఖడ్గం ప్రకాశిస్తూ కనిపించడం ఆసక్తి రేకెత్తించేలా ఉంది. "కొన్ని యుద్ధాలు ఎప్పటికీ ముగియవు. కొంతమంది రాజులు ఎప్పటికీ మరణించరు" అంటూ ఆ పోస్టర్‌కి జోడించిన వ్యాఖ్య సినిమాపై అంచనాలు పెంచేలా ఉంది. "ప్రేక్షకుల్ని సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే సోషియో ఫాంటసీ థ్రిల్లర్ ఇది. సందీప్ కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన చిత్రంగా నిలవనుంది. ఆగస్టు నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభమవుతుంది" అని నిర్మాతలు ప్రకటించారు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడిస్తామన్నారు.



# ఆదర్శవంతమైన కోడలా... దుష్టశక్తా?

ఇటీవలే 'హక్' చిత్రంలో షా బానో అనే శక్తిమంతమైన మహిళా పాత్రలో కనిపించి.. నటనతోనే ప్రేక్షకుల్ని కట్టిపడేసింది కథానాయిక యామీ గౌతమ్. తదుపరిగా కొత్త కోడలి అవతారంలో మెట్టినింటి వారిని భయపెట్టేందుకు సిద్ధమైపోయినట్లు పేర్కొంటూ రాబోయే చిత్రాన్ని ప్రకటించింది. యామీ ప్రధాన పాత్రలో బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్న సినిమా 'నయ్యి నవెల్లి'. అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్ సమర్పిస్తోన్న ఈ చిత్రాన్ని ఆనంద్ ఎల్.రాయ్, హిమాన్షు శర్మ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ విషయాన్ని ఇన్‌స్టాలో అధికారికంగా ప్రకటిస్తూ టైటిల్ పోస్టర్‌ని ఆవిష్కరించింది చిత్రబృందం. "కొత్త కోడలిగా.. మేరట్‌లో గందరగోళంగా ఉన్న ఓ కుటుంబంలో అడుగుపెట్టిన అమ్మాయి.. దానిని స్వర్గంలా మారుస్తుంది. తను నిజంగానే ఆదర్శవంతమైన కోడలా? బహుశా వేరే లోకం నుంచి వచ్చిన దుష్టశక్తి కూడా కావచ్చు కదా! అని తన కుటుంబంలోనే ఒకరికి అనుమానం. మరి అలాంటి విచిత్రమైన పరిస్థితుల నుంచి ఆ కుటుంబం ఎలా బయటపడింది?" అనే కథాంశంతో ఈ సినిమా హారర్ కామెడీగా రూపొందనుందని చిత్రవర్గాలు తెలిపాయి.



# ఆ సంస్థ చేతికి కరుప్పు ఓవర్సీస్ హక్కులు

తమిళ స్టార్ హీరో సూర్య, స్టార్ హీరోయిన్ త్రిష కృష్ణన్ జంటగా రూపొందుతున్న తాజా చిత్రం కరుప్పు ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశలో ఉంది. ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ఫుల్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రాన్ని మే 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో సినిమా పనులను వేగంగా పూర్తి చేస్తూ వస్తున్న చిత్రబృందం తాజాగా ఓవర్సీస్ హక్కులను అమ్మినట్లు ప్రకటించింది. ఈ చిత్ర ఓవర్సీస్ హక్కులను 'Phars Film' సంస్థ దక్కించుకున్నట్లు మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. అలాగే ఈ సినిమాను తమిళ్‌తో పాటు పాన్ ఇండియా మూవీగా పలు భాషల్లో విడుదల చేయనున్నారు.

ఇప్పటికే నార్త్ ఇండియా హక్కులను కూడా అమ్మేశారు. ఆ హక్కులను పెన్ స్టూడియోస్ సంస్థ సొంతం చేసుకుంది. ఈ చిత్రానికి సంగీతాన్ని సాయి అభ్యంకర్ అందిస్తుండగా, డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ఆర్ ప్రభు, ఎస్ఆర్ ప్రకాష్ బాబు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇదిలా ఉండగా, హీరో సూర్య ప్రస్తుతం ఈ చిత్రంతో పాటు దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న విశ్వనాథం అండ్ సన్స్ చిత్రంలో కూడా నటిస్తున్నాడు. గత కొంతకాలంగా సూర్య నటించిన సినిమాలు పెద్దగా ప్రేక్షకాదరణ పొందని నేపథ్యంలో, ఈ రెండు చిత్రాలతో ఆయన ఎలాంటి విజయాలను అందుకుంటాడో చూడాల్సి ఉంది.




# ఆ సంగతి నాకు నాలుగేళ్ల తర్వాత తెలిసింది

'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో నిహారిక నిర్మాతగా హిట్ అందుకున్న సంగతి తెలిసిందే. ఆ విజయోత్సాహంలో ఆమె నిర్మించిన తాజా చిత్రం 'రాకాస'. సంగీత్ శోభన్ హీరోగా మానస శర్మ తెరకెక్కించిన ఈ మూవీ ఏప్రిల్ 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమా విశేషాలతోపాటు పలు వ్యక్తిగత విషయాలు పంచుకున్నారు నిహారిక. తన అన్నయ్య, నటుడు వరుణ్‌తేజ్ ప్రేమ వ్యవహారం గురించి అడగ్గా.. స్పందించారు.

'వరుణ్‌తేజ్ లావణ్య త్రిపాఠిల ప్రేమ గురించి తొలుత మీకే తెలుసట కదా' అని ప్రస్తావించగా.. "ఆ విషయం ముందు తెలియదు. వాళ్ల లవ్‌స్టోరీ గురించి నాలుగేళ్ల తర్వాత తెలిసింది. ఇండస్ట్రీలో అన్నయ్యకు ఎక్కువమంది స్నేహితులు లేరు. అందుకే ఆ విషయం సీక్రెట్‌గా ఉంది. అయితే, అందరూ మా అన్నయ్యను ఇంట్రావర్ట్ అనుకుంటారు. కానీ, కాదు. అలా కనిపిస్తాడంతే (నవ్వుతూ). రౌడీ.. బాగా ఏడిపిస్తాడు. అన్నయ్య బర్త్‌డే సెలబ్రేషన్స్‌కు లావణ్య వచ్చారు. మా అన్నయ్య ఎవరినీ పార్టీలకు పిలవడు కాబట్టి.. అప్పుడే వాళ్లు లవ్‌లో ఉన్నారని అర్థమైంది" అని నిహారిక చెప్పారు. వరుణ్ లావణ్య వివాహం 2023లో జరిగిన సంగతి తెలిసిందే. వీరికి ఓ కుమారుడు.

'మీరు మళ్లీ పెళ్లి చేసుకుంటారా?' అని ప్రశ్నించగా.. తప్పకుండా చేసుకుంటానని, అయితే ప్రత్యేకంగా దృష్టిపెట్టడం లేదన్నారు. సోషల్ మీడియాలో అసభ్యకరంగా ప్రవర్తించే వారి గురించి మాట్లాడుతూ.. "దానిని కొందరు జన్మహక్కుగా భావిస్తుంటారు. భయం లేకపోవడం వల్ల అలా చేస్తున్నారు. అలాంటి వారిలో ఒకరికి సరైన శిక్ష విధిస్తే.. ఇతరులకు బుద్ధి వస్తుంది" అని పేర్కొన్నారు. 'రాకాస' గురించి చెబుతూ.. "ఫాంటసీ+ కామెడీ జానర్‌లో వచ్చిన అతి తక్కువ సినిమాల్లో ఇదొకటి. ప్రేక్షకులకు మంచి వినోదం పంచాలన్న ఉద్దేశంతోనే ఈ సినిమా తీశాం" అని చెప్పారు.

